క్లుప్తంగా

ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ఎన్నిక



నూతన కమిటీ బాధ్యులు

పాల్వంచ: పాల్వంచ డివిజన్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడిగా ఎండీ.ముర్తుజా అలీఖాన్, ప్రధాన కార్యదర్శిగా జి.రాజు నియామకమాయ్యరు. గురువారం స్థానిక శ్రీ సిద్దార్థ హైస్కూల్‌లో సమావేశం నిర్వహించారు. కోశాధికారిగా కె.వెంకటేశ్వర రావు, జి.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులుగా డి.దీప్తి, విజయ్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా క్రిసోలైట్, కార్యవర్గ సభ్యులుగా వి.శ్రీనివాసరావు తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముర్తుజా అలీఖాన్ మాట్లాడుతూ... ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సమస్యలపై కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండి లక్ష్మణ్, ఎం.కృష్ణ, జీఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ

ఇల్లెందురూరల్: ఉన్నత పాఠశాలల ఇంగ్లిష్ ఉపాధ్యాయులకు మండలంలోని సుభాష్‌నగర్ హైస్కూల్‌లో గురువారం వృత్యంతర శిక్షణ నిర్వహించారు. కోర్స్ డైరెక్టర్ శారద, నోడల్ అధికారి స్వామి మాట్లాడుతూ.. శిక్షణ శిబిరంలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో ఆచరణలో పెట్టి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి ఆంగ్లంలో సులువుగా మాట్లాడేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. హెచ్‌ఎం నాగేశ్వరరావు, రిసోర్స్ పర్సన్లు మీరాహుస్సేన్, సత్యనారాయణ, సైదులు, రమేష్, ఇల్లెందు, గుండాల, టేకులపల్లి, ఆళ్లపల్లి మండలాల ఇంగ్లిష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికులకు పని కల్పించండి

ఇల్లెందు: సింగరేణి జేకే ఓసీలో సివిల్ డిపార్ట్‌మెంటులో పని చేస్తున్న కార్మికులకు పని కలిపించి కార్మికులను ఆదుకోవాలని ఇఫ్టూ అనుబంధ కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాకుబ్‌షావలీ డిమాండ్ చేశారు. గురువారం ఇల్లెందులో సింగరేణి అధికారులకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. 28 రోజులుగా సివిల్ డిపార్ట్‌మెంటులో పని చేస్తున్న కార్మికులకు ఉపాధి లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. టెండర్ కాలం ముగిసినా మళ్లీ టెండర్ ప్రక్రియ ప్రారంభించటం లేదన్నారు. టెండర్ లేక పనిలోకి తీసుకోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వెంకట్, పద్మ, సుజాత, స్వరూప, సునీత పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటర్లుగా నమోదవ్వాలి

ఇల్లెందురూరల్: 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటర్లుగా నమోదవ్వాలని తహసీల్దార్ రవికుమార్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఓటురుగా నమోదు, ఓటు వేసే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాట్లాడుతూ.. ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని చెప్పారు. విద్యావంతులైన యువత పల్లెల్లో ప్రజలను చైతన్యపర్చడంలో బాధ్యత తీసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ, అధ్యాపకులు రాజు, శేఖర్, చెంచురత్నయ్య, ఇంద్రాణి, సరిత పాల్గొన్నారు. కొమరారం ఉన్నత పాఠశాలలో ఓటరు నమోదు, ఓటు వేసే విధానంపై విద్యార్థులకు మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీకాంత్ గురువారం అవగాహన కల్పించారు. నమూనా ఈవీఎంపై విద్యార్థుల చేత ఓటు వేయించి ఈవీఎం పనితీరును వివరించారు.

సార్ వస్తేనే... పిల్లలను పంపిస్తాం



నిరసన తెలియజేస్తున్న తల్లిదండ్రులు

టేకులపల్లి: రెండేళ్లుగా ఉపాధ్యాయుడు శంకర్ పాఠశాలను తీర్చిదిద్దడమే కాక పిల్లల్లో విద్యా ప్రమాణాలు పెంచారు. ఆయన లేకపోతే తమ పిల్లలను పాఠశాలకు పంపించేది లేదని విద్యార్థుల తల్లిదండ్రులు తేల్చిచెప్పారు. టేకులపల్లి పంచాయతీ ఏ కాలనీతండాలో గిరిజన సంక్షేమ శాఖ ప్రాథమిక పాఠశాల వద్ద గురువారం వారు నిరసన తెలిపారు. పాఠశాలలో మొత్తం 17 మంది విద్యార్థులు ఉండగా, గురువారం ఎవరూ రాలేదు. ఎస్‌ఎంసీ చైర్మన్, సభ్యుడు బానోతు క్రాంతికుమార్, అజ్మీరా రవికుమార్, ధరావత్ వీరు, మహేష్, స్వప్న, లాలు, రమేష్, చిన్నా, కృష్ణ మాట్లాడుతూ... ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న తమ పిల్లలను ఉపాధ్యాయుడు శంకర్ చెబితే ఇక్కడ చేర్చామని, ఇప్పుడు ఆయనను డిప్యుటేషన్‌పై ఇతర పాఠశాలకు పంపడం సరికాదన్నారు. ఈ విషయమై ఐటీడీఏ పీఓ, డీడీలను కలిసి వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. సదరు ఉపాధ్యాయుడిని తిరిగి పంపే వరకు తమ పాఠశాలకు పంపించేది లేదని స్పష్టం చేశారు.

డిగ్రీ కళాశాలపై చిన్నచూపు

సౌకర్యాలతో కూడిన భవనం.. పూర్తిస్థాయిలో అధ్యాపకులు, నాణ్యతతో కూడిన బోధన.. విద్యార్థుల సంఖ్యతోపాటు పురోగతి.. ప్రయోగాలతో పాఠ్యాంశాలు.. ఉత్తీర్ణతలో ప్రగతి.. తదితర వాటితో న్యాక్‌లో మూడుసార్లు మంచి గ్రేడింగ్ పాయింట్లు సాధించిన ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధాన మంత్రి ఉచితార్ శిక్ష అభియాన్ (పీఎం ఉషా) నిధుల మంజూరు తాజా జాబితాలో చోటు దక్కించుకోలేక పోయింది. ఈ ప్రభావం కళాశాల అభివృద్ధి, మనుగడపై తీవ్ర ప్రభావం చూపుతుందని పలువురు విద్యావేత్తలు అంటున్నారు.

- మూడుసార్లు న్యాక్‌లో మెరుగైన గ్రేడింగ్ పాయింట్లు
- నిధుల మంజూరుకు దక్కని చోటు
- రెండుసార్లు రూ.7 కోట్లు నష్టపోయిన ఇల్లెందు కళాశాల
- కళాశాల అభివృద్ధిపై తీవ్ర ప్రభావం



ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఇల్లెందురూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇప్పటి వరకు మూడుసార్లు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) బృందం తనిఖీలు జరిగాయి. 2007, 2016లలో బి గ్రేడ్ సాధించగా 2023లో ఏప్లస్ సాధించింది. 2007లో మొదటి దఫా న్యాక్‌కు ఎంపికైనందున రాష్ట్రీయ ఉచ్చతర శిక్షా అభియాన్ (రూసా) నిధులు దూరమయ్యాయని అందరూ భావించారు. కానీ 2016లోనూ బి గ్రేడ్ సాధించినప్పటికి రూ.2కోట్లు నిధుల మంజూరు కావాల్సి ఉండగా మళ్లీ అన్యాయమే జరిగింది. ఇల్లెందు డిగ్రీ కళాశాల కంటే తక్కువ గ్రేడ్ సాధించిన కళాశాలలకు రూసా నిధులు మంజూరు చేసిన ఉన్నత విద్యాశాఖ ఇల్లెందుపై చిన్నచూపు చూశారని విమర్శలు వచ్చాయి. కానీ 2023లో కళాశాల ఏకంగా ఏప్లస్ గ్రేడ్ సాధించింది. ఆ రోజే కళాశాలకు (రూసా పేరును పీఎం ఉషాగా మార్చారు) పీఎం ఉషా నిధులు రూ.5కోట్లు మంజూరవుతాయని అందరూ భావించి సంబురాలు జరుపుకున్నారు. కానీ గురువారం ఉన్నత విద్యశాఖ ప్రకటించిన పీఎం ఉషా నిధుల మంజూరు జాబితాలో రాష్ట్ర వ్యాప్తంగా 62 కళాశాలలకు చోటు కల్పించింది. భద్రాద్రి జిల్లాలో మూడు కళాశాలలకు చోటు దక్కింది. కానీ ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వరుసగా మూడోసారి కూడా అన్యాయం జరిగిందని విద్యావేత్తలు వాపోతున్నారు. ఇదిలా ఉండగా పీఎం ఉషాలో నిధులు మంజూరు జాబితాలో ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పేరు ఉందని, ఇందుకు శిక్షణ శిబిరానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పొలరపు పద్మకు అహ్వానం అందింది. ఈనెల 6న శిక్షణ శిబిరానికి హాజరై ధృవీకరణ పత్రాన్ని కూడా అందుకున్నారు. కానీ ఏం జరిగిందో.. నిధుల మంజూరు జాబితాలో మాత్రం ఇల్లెందు పేరు లేదు.

నిధులు మంజూరైతే మరింత అభివృద్ధి..

పీఎం ఉషా ద్వారా కళాశాలకు నిధులు మంజూరై ఉంటే.. ఇంటిగ్రేటెడ్ హాస్టల్, అదనపు గదులు, కాన్ఫరెన్స్ హాల్, వాష్ రూమ్స్, కొత్త కంప్యూటర్లు, డిజిటల్ క్లాస్ రూమ్స్ తదితర అదనపు సౌకర్యాలు అందుబాటులోకి వచ్చేవి. గదుల కొరత కారణంగా ప్రస్తుతం ల్యాబ్‌లలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. తరగతి గదినే కాన్ఫరెన్స్ హాలుగా వినియోగిస్తున్నారు. కళాశాల రెండు అంతస్తుల్లో ఉన్నా వాష్ రూమ్స్ ఒకేచోట ఉండటంతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. నిధులు మంజూరై ఉంటే ఆయా సమస్యలను అధిగమించడంతోపాటు నూతన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చేవి.

కళాశాల ప్రస్థానం ఇలా..

పూర్తి ఏజెన్సీ ప్రాంతమైన ఇల్లెందులో డిగ్రీ కళాశాల అవసరమని పలు విద్యార్థి సంఘాలు, రాజకీయ పక్షాల నాయకులు పోరాటాలు నిర్వహించిన ఫలితంగా 1992లో డిగ్రీ కళాశాలను మంజూరు చేశారు. సొంత భవనం లేకపోవడంతో దాదాపు దశాబ్దం వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకపూట తరగతులతో కొనసాగింది. మరోసారి విద్యార్థులు, రాజకీయ పక్షాలు ఉద్యమించడంతో ప్రభుత్వం పట్టణ శివారులో విశాలమైన స్థలాన్ని కేటాయించింది. వెంటనే తరగతి గదులతో నూతన భవనం నిర్మితమైంది. ప్రారంభంలో ఏజెన్సీ గ్రామాల నుంచి గిరిజన విద్యార్థులు అత్యధికంగా కళాశాలలో విద్యనభ్యసించారు. గడిచిన మూడేళ్లుగా కళాశాల న్యాక్‌లో మంచి గ్రేడింగ్ పాయింట్లు సాధించడం.. ఉత్తీర్ణతలోనూ రాష్ట్రస్థాయిలో ర్యాంకులు పొందడంతో అన్నివర్గాల ప్రజలు కళాశాలలో ప్రవేశాలు పొందుతున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో మొత్తం 415 మంది విద్యనభ్యసిస్తుండగా అందులో 302 మంది గిరిజనులు.

సిఫారసు లేఖలతోనైనా...

ప్రభుత్వ డిగ్రీ కళాశాల న్యాక్‌లో వరుసగా మూడుసార్లు మంచి గ్రేడింగ్ పాయింట్లు సాదించినా నేటికీ రూసా, పీఎం ఉషాలలో ఒక్క రూపాయి కూడా నిధులు మంజూరు కాలేదని, తాజాగా ప్రకటించిన మంజూరు జాబితాలో ఇల్లెందుకు చోటు దక్కకపోవడంపై విద్యార్థి సంఘాల తీవ్రంగా నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ఈసారి ఎలాగైనా నిధులు సాధించుకోవాలన్న సంకల్పంతో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ, అధ్యాపకులు కళాశాలకు సంబంధించిన నివేదికలను సిద్ధం చేసి, ప్రజాప్రతినిధుల సహకారంతో ఉన్నత విద్యాశాఖాధికారులను కలిసి నిధులు సాధించాలనే పట్టుదలతో ముందుకు సాగుతున్నారు.

మా వంతు ప్రయత్నం చేస్తున్నాం..



వరుసగా మూడుసార్లు న్యాక్‌లో మంచి గ్రేడింగ్ పాయింట్లు సాధించాం. కానీ రూసా, పీఎం ఉషాల ద్వారా కళాశాలకు ఒక్క రూపాయి కూడా మంజూరు కాలేదు. ఈసారి పీఎం ఉషాలో నిధులు మంజూరవుతాయని నమ్మకం కలిగింది. శిక్షణ శిబిరానికి కూడా ఆహ్వానించారు. కానీ నిధుల మంజూరు జాబితాలో అన్యాయం జరిగింది. ఇదే విషయమై ప్రజాప్రతినిధుల సహకారంతో నిధులు సాధించుకునేలా మా వంతు ప్రయత్నం చేస్తున్నాం.

– డాక్టర్ పోలారపు పద్మ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇల్లెందు

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టండి



ఎమ్మార్పీఎస్ నేతలకు సంఘీభావం తెలుపుతున్న గుమ్మడి అనురాధ

ఇల్లెందు: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఈ నెల 18 నుంచి 22 వరకు జరగనున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టి అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి మెంతెన వసంతరావు మాదిగ, వంగూరి ఆనందరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఇల్లెందు కొత్త బస్టాండ్ అంబేద్కర్ సెంటర్‌లో మహాజన సోషలిస్టు పార్టీ, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఇల్లెందు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ గుమ్మడి అనురాధ దీక్షలను ప్రారంభించి సంఘీభావం ప్రకటించారు. నేతలు మాట్లాడుతూ.. మూడు దశాబ్ధాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, రెండు తెలుగు రాష్ట్రాల్లో వర్గీకరణ కోసం మంద కృష్ణమాదిగ అలుపెరగని పోరాటం నిర్వహిస్తుంటే అధికార, ప్రతిపక్ష పార్టీలు ముందుకు రాకపోవటం దుర్మార్గం అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ ప్రభావం గుర్తించి మాదిగ ఉపకులాలకు న్యాయం జరిగేట్లు బిల్లును ప్రవేశపెట్టాలని కోరారు. సమావేశంలో జనక ఇస్తారీ మాదిగ, కాపా ప్రసాద్, నాగరాజు, సర్వయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు వేధింపులు ఆపాలి

సుజాతనగర్: ఆటో కార్మికుల పట్ల పోలీసుల వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఈర్ల రమేష్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆటో యూనియన్ ముఖ్య నాయకుల సమావేశాన్ని సుజాతనగర్‌లో గురువారం నిర్వహించారు. మాట్లాడుతూ.. సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడంతో చదువుకున్న ఎంతో మంది యువకులు ఆటో రంగాన్ని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారని, పోలీసు వేధింపులతో అనేకమంది ఆటో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి పట్ల పోలీసుల వేధింపులు మానుకోవాలని, ఆటోవాలాకు ఏడాదికి రూ.50 వేల భృతి కల్పించాలని, రూ.10 లక్షల ప్రమాద బీమా ఇవ్వాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఐటీయూ ఆటో యూనియన్ సుజాతనగర్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా కస్నబోయిన యాకయ్య, కార్యదర్శిగా మద్దెల ప్రసాద్, కోశాధికారిగా కన్నయ్య తదితరులను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న ఈర్ల రమేష్

బీజేపీ నేతల నిరసన

చుంచుపల్లి: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి నిరుద్యోగుల కోసం చేపట్టిన 24 గంటల ఉపవాస దీక్షను భగ్నం చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర పార్టీ పిలుపులో భాగంగా గురువారం బీజేపీ శ్రేణులు కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ.. తొమ్మిదిన్నర సంవత్సరాలుగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, నిరుద్యోగ భృతి కల్పిస్తానని సీఎం కేసీఆర్ మోసం చేశారని ఆరోపించారు.

కార్యక్రమంలో కేవీ రంగాకిరణ్, ఎడ్లపల్లి శ్రీనివాస్ కుమార్, ఆకుల నాగేశ్వరరావు గౌడ్, చింతలచెరువు శ్రీనివాసరావు, అగర్వాల్, వల్లపు సాయిరాం, శ్రీనివాస్ గౌడ్, జంటంగి కృష్ణ, రాపాక రమేష్, జల్లారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సహకార సంఘం ముట్టడి



చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

జూలూరుపాడు: రైతు రుణాలను రీషెడ్యూల్ చేసి, కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం రైతు సంఘం జూలూరుపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సహకార సంఘం కార్యాలయాన్ని ముట్టడించారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ మాట్లాడుతూ.. జూలూరుపాడు సహకార సంఘం పాలక వర్గంలో సంక్షోభం కారణంగా రుణాలను రీషెడ్యూల్ చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. కేంద్ర సహకార బ్యాంకు పంపించిన రూ.50 లక్షల సొమ్మును సైతం తీర్మానం చేసి రైతులకు ఇవ్వాల్సి ఉన్నా, పాలకవర్గం ఆధిపత్య పోరుతో రుణాల రీషెడ్యూల్ చేయడం లేదని ఆరోపించారు. అనంతరం సహకార సంఘం చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డికి రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. రైతులకు అన్యాయం జరగకుండా రుణాలను రీషెడ్యూల్ చేయనున్నట్లు వెంకటరెడ్డి హామీ ఇచ్చారు. రైతు సంఘం నాయకులు రెడ్డెబోయిన గోవిందు, జల్లిక రాధాకృష్ణ, నరేష్, బానోత్ ఇస్రా, వెంకటేశ్వర్లు, ఊడల వెంకటేశ్వర్లు, సుగుణ పాల్గొన్నారు.

సింగరేణి స్పోర్ట్స్ కోఆర్డినేటర్‌గా సంగారావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా స్పోర్ట్స్ కోఆర్డినేటర్‌గా 2023–24 సంవత్సరానికి సీహెచ్ సంగారావును నియమించినట్లు ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలెంరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

కొత్తగూడెంటౌన్: జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులు ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని, జిల్లా సంక్షేమశాఖ అధికారిణి వేల్పుల విజేత గురువారం ఒక ప్రకటనలో కోరారు. 2023–2024 సంవత్సరానికి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో 1 – 10 వ తరగతి విద్యనభ్యసించే దివ్యాంగ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 31వ తేదీ వరకు ఇ–పాస్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, తరగతులను బట్టి ఉపకార వేతనాలు మంజూరు ఉంటుందని, వివరాలకు 8331006010 నంబరులో సంప్రదించాలని కోరారు.

నిత్యావసరాల పంపిణీ

జూలూరుపాడు: మండలంలోని పలు గ్రామాల్లోని పేద కుటుంబాలకు గురువారం బోడెపూడి ట్రస్టు ఖమ్మం వారు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. రామకృష్ణాపురం, కాకర్ల, జూలూరుపాడు, గుండ్లరేవు గ్రామాల్లో పలు కుటుంబాలకు ట్రస్టు చైర్మన్ బోడెపూడి రాజా సరుకులు అందజేశారు. జూలూరుపాడు గ్రామ యువతకు స్పోర్ట్స్ కిట్లు అందించారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ చేపట్టిన దీక్షా శిబిరాన్ని ట్రస్టు చైర్మన్ రాజా సందర్శించి, సంఘీభావం తెలిపి, పండ్లు పంపిణీ చేశారు.

బైపాస్ రోడ్డు మంజూరు చేయండి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో బైపాస్ రోడ్డు లేకపోవడంతో తరచు ప్రమాదాలు జరుగున్నాయని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మధురబస్తీకి నివాసి రాణి మృతదేహానికి గురువారం నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. మాట్లాడుతూ.. కొత్తగూడెంలో జనాభా రోజురోజుకు పెరుగుతున్నా బైపాస్ రోడ్డు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు.

పేకాట స్థావరంపై దాడి

పాల్వంచరూరల్: పేకాడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. పునుకుల గ్రామ శివారులో గురువారం పేకాట స్థావరంపై ఎస్‌ఐ.కార్తీక్ దాడి చేసి ఐదురుగు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.6,380 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రజాసంక్షేమంపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

టేకులపల్లి: ప్రజాప్రతినిధులు ప్రజల కోసం, ప్రజా సంక్షేమం కోసం పని చేయాలని, ప్రజాసమస్యల పరిష్కారం కోసం వేదిక అయిన సర్వసభ్య సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కాకపోతే ఎలా అని జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. గురువారం ఎంపీపీ భూక్యా రాధ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. విద్య, వైద్యం, పశువైద్యం, స్త్రీ, శిశు సంక్షేమం, ఫారెస్టు, వ్యవసాయం, ఈజీఎస్, సెర్ప్, విద్యుత్, పీఆర్, ఇంజనీరింగ్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఎంపీడీఓ కోట వీరబాబు, తహసీల్దార్ కొండపల్లి కృష్ణవేణి, పీఏసీఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్, శ్రీనివాస్, జయకృష్ణ పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయండి..

నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా సులానగర్ సమీపంలో నిర్మించనున్న టోల్ ప్లాజా కోసం భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు బాధిత రైతులు టేకులపల్లి తహసీల్‌కు రావడంతో వారికి మద్దతుగా వెళ్లి తహసీల్దార్‌తో మాట్లాడారు. నేషనల్ హై వేను ముందుగానే డిజైన్ చేయబడిందని మార్పులు, చేర్పులు మా చేతిలో ఉండదని, హైవే నిర్మాణం అనేది ఆగదని, భూసర్వేకు సహకరించాలని తహసీల్దార్ కృష్ణవేణి కోరారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే...

రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు నాలుగు రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా నేత లక్కినేని సురేందర్ విమర్శించారు. గురువారం టేకులపల్లిలో అంగన్‌వాడీల సమ్మె శిబిరానికి వెళ్లి మద్దతు తెలిపారు. అంగన్‌వాడీలు జెడ్పీ చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. కనకయ్య మాట్లాడుతూ.. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని,సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని భరోసా ఇచ్చారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం



ప్రచారం చేస్తున్న ఎడవల్లి కృష్ణ

పాల్వంచరూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేద ప్రజల జీవితాల్లో మార్పులు వస్తాయని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లికృష్ణ అన్నారు. సూరారం గ్రామంలో గురువారం గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో ఎడవల్లి కృష్ణ పాల్గొన్నారు. మాట్లాడుతూ.. గ్రామంలో చాప రాములు ఆధ్వర్యంలో 40 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ కేవలం మాటల ప్రభుత్వమేనన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోని కేసీఆర్‌ను రానున్న ఎన్నికల్లో ఓడించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పోడు భూములకు పట్టాలు ఇచ్చి సమస్యలు పరిష్కరిస్తుందన్నారు. 18 సంవత్సరాల పైబడిన విద్యార్థులకు ఎలక్ట్రికల్ స్కూటర్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తుందన్నారు. కొండం వెంకన్నగౌడ్, చారి, వీరయ్యచౌదరి, బత్తుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయభేరికి తరలిరండి

చుంచుపల్లి: 17న హైదరాబాద్‌లో నిర్వహించనున్న కాంగ్రెస్ విజయభేరి సభకు భారీ ఎత్తున ప్రజలు తరలిరావాలని చుంచుపల్లి తండాలో గురువారం గడప గడపకు కాంగ్రెస్ ప్రచారం నిర్వహించారు. పార్టీ జిల్లా నాయకులు నాగా సీతారాములు మాట్లాడుతూ.. 17న రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో జరగనున్న విజయభేరీ సభలో సోనియాగాంధీ ఐదు గ్యారంటీ హామీలను విడుదల చేస్తారని చెప్పారు. ఊకంటి గోపాలరావు, తూము చౌదరి, ఆళ్ల మురళి, కున్సోత్ కిషన్, భూక్యా చిన్న పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలపై దాడులు గర్హనీయం



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

సుజాతనగర్: అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె చేస్తుంటే వారి కేంద్రాలపై దాడులకు పాల్పడటం ఎంత వరకు సమంజసమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కనీస వేతనాల అమలు, పనిభద్రత కోసం ఏఐటీయూసీ, సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ అసోసియేషన్ల ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె నాలుగో రోజైన గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా సమ్మె శిబిరాన్ని సాబీర్‌పాషా సందర్శించారు. మాట్లాడుతూ... కేసీఆర్ పాలన రజాకార్ల పాలనను తలపిస్తోందని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని పోరాడుతున్న కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తూ దాడులు, బెదిరింపులకు పాల్పడటం తగదన్నారు. సమ్మెను జీర్ణించుకోలేక అధికారులు, పోలీసులను ఉసిగొల్పి తాళాలు పగులగొట్టి కేంద్రాలను స్వాధీనం చేసుకుంటున్నారని, ఇలాంటి నిర్ణయాలు గతంలో ఏ ప్రభుత్వాలు తీసుకోలేదన్నారు. ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): అండర్ బ్రిడ్జి ప్రమాద మృతులు ఎదులాపురం శ్రీనివాస్, స్టెల్లామేరీ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా డిమాండ్ చేశారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించిన మృతదేహాలను గురువారం సందర్శించి నివాళులర్పించారు. ఒక్కొక్కరికీ రూ.25 లక్షల పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు.

తాళాలు పగులగొట్టించిన సీడీపీఓ



జూలూరుపాడు: సరుకులు పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్

పాల్వంచరూరల్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు అంగన్‌వాడీ కేంద్రాలకు తాళాలు వేసి సమ్మె చేయడంతో నాలుగు రోజులుగా అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. దీంతో చంద్రాలగూడెం, రేగులగూడెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల తలుపుల తాళాలను సీడీపీఓ కనకదుర్గ తాళాలు పగలగొట్టించి కేంద్రాలను తెరిపించారు. గుడ్లు నిల్వ ఉండటంతో పాడైపోయే ప్రమాదం ఉందని పాఠశాల ఉపాధ్యాయులు, కార్యదర్శుల ద్వారా గర్భిణులు, బాలింతలు, విద్యార్థులకు పంపిణీ చేసేవిధంగా చర్యలు తీసుకున్నట్లు సీడీపీఓ తెలిపారు.

జూలూరుపాడు: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సమ్మెకు దిగడంతో గురువారం బాలింతలు, గర్భిణులకు ఐసీడీఎస్ అధికారులు సరుకులు పంపిణీ చేశారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తెరిపించారు. పలువురు అంగన్‌వాడీ టీచర్లు కేంద్రాల తాళాలు ఇచ్చి సహకరించగా, మరికొందరు తాళాలు ఇవ్వడానికి విముఖత వ్యక్తం చేశారు. దీంతో తాళాలు పగులగొట్టి అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, పంచాయతీ సెక్రటరీలు సరుకులు పంపిణీ చేశారు.

పోలీసులకు ఫిర్యాదు

టేకులపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులకొట్టి అందులోని వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తు కెళ్లారని అంగన్‌వాడీలు టేకులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు తెలిపిన వివరాలు.. నిరవధిక సమ్మెలో అంగన్‌వాడీలు ఉండగా మండలంలోని 15 అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారని, సమగ్ర విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

జాతీయ భాష హిందీ దినోత్సవాన్ని గురువారం పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. హిందీ భాష సరళంగా నేర్చుకోవచ్చన్నారు. భారత పార్లమెంటు రాజ్యాంగంలోని ఆర్టికల్ 343/1 ప్రకారం హిందీ భాషను వ్యవహారిక భాషతో పాటు జాతీయ హోదా కల్పించారని చెప్పారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయులను సన్మానించారు. – సాక్షి నెట్‌వర్క్



పాల్వంచరూరల్: గురుకుల పాఠశాలలో హిందీ టీచర్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



కొత్తగూడెంఅర్బన్: మేదరబస్తీలోని ఉన్నత పాఠశాలలో బహుమతులు అందజేస్తున్న దృశ్యం



కొత్తగూడెంరూరల్: త్రివేణి పాఠశాలలో హిందీ దినోత్సవ వేడుకలో ఉపాధ్యాయులు, విద్యార్థులు